4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 1 జూలై 2024
www.ntnews.com

# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

# భర్తృహరి.. లోక హితవరి



'రఘువర్మ'
92900 93933

**'బోద్ధారో మత్సర గ్రస్తాః ప్రభవః స్మయదూషితాః/ అబోధోపహతాశ్చాన్యే జీర్ణమఙ్గే సుభాషితం' (సాటి పండితులేమో అసూయగ్రస్తులు, ప్రభువులు అహంకార పూరితులు/ మిగిలినవారు అర్థం చేసుకోలేనివారు / అందుకే నేను చెప్పాలను కుంటున్న మంచి మాట/ నా లోలోపలే అరిగికరిగిపోతోంది) అంటూ మనసులో బాధపడుతూనే యోగికవి భర్తృహరి నీతి, శృంగార, వైరాగ్య శతకత్రయాన్ని - లోక శ్రేయస్సు కోసం నీతినుపదేశించడానికి రచించాడు.**



యోగి కవి భర్తృహరి గురించి: సంస్కృత సాహిత్యంలో యోగి కవి భర్తృహరి నీతి, శృంగార, వైరాగ్య శతకకర్తగా, 'మహాభాష్య' వ్యాఖ్యానకర్తగా, 'వాక్యపదీయం' అనే గ్రంథం రచించిన వైయాకరణుడిగా సుప్రసిద్ధుడు. 'భర్తృహరి' అనే పదానికి దేవుడిని భక్తితో ఆరాధిస్తూ దేవుడికే తన జీవితాన్ని అంకితం చేసినవాడని అర్థం- అని పండితవాక్కు.

భర్తృహరి గురించీ, అతడి కాలం గురించీ భిన్న భిన్న కథనాలున్నాయి. భర్తృహరి ఉజ్జయిని రాజు అనీ, అతడి తమ్ముడు విక్రమాదిత్యుడు అనీ, ప్రియ భార్య పింగళ మరొకరితో ప్రేమాయణం సాగిస్తుందని తెలిసి మనసు విరిగిన భర్తృహరి రాజ్యాన్ని తమ్ముడికి అప్పగించి, అడవికి వెళ్లి యోగీశ్వరుడిగా మారాడనీ, ఆ కాలంలోనే శతకత్రయాది రచనలను చేసి ఉంటాడనీ ఒక కథనం! 'రావణ వధ' పేరుతో రామాయణాన్ని రాసిన భట్టికవీ, భర్తృహరీ ఒకడేననీ మరో కథనం. భర్తృహరి బౌద్ధ సన్యాసి అని ఇంకో కథనం!

భారతదేశ చరిత్రలో విక్రమశక (క్రీ.పూ.57) మూల పురుషుడూ, తొలి విక్రమాదిత్యుడు మొదలుకొని ఆ పేరూ బిరుదూ గల రాజులు పద్నాలుగు మంది రాజ్యాలేలారు. సముద్ర గుప్తుడి పుత్రుడైన రెండవ చంద్రగుప్త విక్రమాదిత్యుడి (క్రీ.శ.375-415) ఆస్థానంలోని నవ రత్నాలలో ఒకడుగా మహా కవి కాళిదాసు ఉండేవాడు. అతడి 'అభిజ్ఞాన శాకుంతలం' నాటకంలోని అయిదవ అంకంలో 12వ శ్లోకం 'భవన్తి నమ్రాస్త రవః.. వైష పరోపకారిణం' భర్తృహరి విరచిత 'నీతి శతకం'లో 61వ శ్లోకంగా కనిపిస్తుంది. క్రీ.శ. 6వ శతాబ్దం వాడైన విష్ణుశర్మ రచన 'పంచతంత్రం'లో - భర్తృహరి 'నీతిశతకం'లోని 85వ శ్లోకమైన 'గజ భుజంగ విహంగమ బంధనం' కనబడుతుంది. కనుక భర్తృహరి, కవి కాళిదాసుకు తక్షణకాలం వాడు, విష్ణుశర్మ పూర్వుడు అనీ, అంటే క్రీ.శ.5వ శతాబ్దానికి చెందినవాడనీ రూఢీ అవుతోంది.

ఇక భట్టికవి క్రీ.శ 7వ శతాబ్దికి చెందిన భామహుడికీ, దండికీ సమకాలీకుడని చరిత్ర చెబుతోంది. క్రీ.శ.691లో భారతదేశానికి వచ్చిన చైనా దేశీయుడు 'ఇత్సింగ్' నలందాలో విద్యార్థిగా ఉంటూ భర్తృహరిని బౌద్ధ సన్యాసిగా పేర్కొన్నాడు. భర్తృహరి శాస్త్ర గ్రంథాలపై అతడు ప్రసంగిస్తూ-భర్తృహరి మానవనీతి సూత్రాలనూ రచించాడనీ తెలిపాడు.

భర్తృహరి తన 'నీతి శతకం' 1వ శ్లోకంలో 'ప్రభవః స్మయదూషితాః' (రాజులు అహంకారపూరితులు) అన్నాడు. తన 'వైరాగ్య శతకం' 59వ శ్లోకంలో - మిక్కిలి అల్ప, దరిద్ర నీచ గుణాల రాజుల నుంచి స్వల్పధనాన్ని కూడా ఆశించే పురుషాధములను ఛీ కొట్టాలి' అని చెప్పాడు. ఇట్లా తన శతక శ్లోకాల్లో రాజులనూ, రాచరికాన్ని నిరసిస్తూ దూషించిన భర్తృహరి రాజవంశానికి చెందినవాడు కాకపోవచ్చునని తోస్తుంది. 'వైరాగ్య శతకం' మంగళాచరణ శ్లోకంలో భర్తృహరి 'చూడోత్తంసిత చారు చంద్ర కలికా... జ్ఞాన ప్రదీపోహరః అంటూ శివుడిని స్తుతించడాన్ని బట్టి శివ భక్తుడనీ తెలుస్తోంది.

'వైరాగ్య శతకం' రెండవ శ్లోకం 'భ్రాన్తం దేశమ నేక దుర్గ విషమం'లో ఎవరూ వెళ్లలేని కొండల దాటేసి, ఉండతగని దేశాల్లో సంచరించాననీ, జాతి, కులం, సిగ్గూ వదలి ఎవరెవరికో సేవలు చేశాననీ, ఇతరుల ఇళ్లల్లో కాకి వలె బెదురుతూ కూడు తిన్నాననీ చెప్పుకోవడాన్ని బట్టీ, ఇందులోనే నాల్గవ శ్లోకం 'ఉత్థాతం నిధి శంకయా క్షితితలం'లో నిధుల కోసం భూమిని తవ్వాననీ, బంగారం కోసం కొండమణి శిలల కరిగించాననీ', సముద్ర యానం చేశాననీ, రాజులకిష్టంగా నడుచుకున్నాననీ, మంత్రారాధనలతో స్మశానాల్లో రాత్రుళ్లు గడిపాననీ- అయినా గుడ్డి గవ్వనైనా చూడలేకపోయానని తన కష్టాలను భర్తృహరి వివరించడాన్ని బట్టి అతడు శైవబ్రాహ్మణుడనీ, రాజాశ్రయాల కోసం దేశదేశాలూ తిరిగాడనీ అర్థమవుతోంది. రాజాశ్రయాల్లో బతుకుతూ విధి రాత వల్ల జీవితంలో జరిగిన ఏదో సంఘటనతో యోగిగా మారి ఉంటాడన్పిస్తుంది.

భర్తృహరి శతకత్రయ ప్రశస్తి: చాణక్య శతకం, బాణభట్టు చండీ శతకం, మయూరకవి సూర్యశతకం వంటి ప్రసిద్ధ రచనలు ఉన్నా, భర్తృహరి తాను కష్టాలతో వడబోసిన స్వానుభవాలతో, సంక్షిప్త భావాలతో సహజాలంకారాలతో, సరళశైలిలో రాసిన శతకత్రయ శ్లోకాలు నాటినుంచి ప్రజలనాకట్టుకొని బహుళ ప్రచారంలో ఉన్నాయి. ఇవి పాశ్చాత్య పండితులనూ ఆకర్షించి డచ్, లాటిన్, గ్రీకు, జర్మన్, ఫ్రెంచ్, ఇంగ్లీషు, వంటి ప్రపంచ భాషల్లోకి అనువాదమయ్యాయి. 17వ శతాబ్దం నుండీ తెలుగులోకి ఎలకూచి బాల సరస్వతి, పుష్పగిరి తిమ్మన, ఏనుగు లక్ష్మణకవి పోచిరాజు వీరన్న, కొక్కొండ వెంకటరత్నం పంతులు మొదలైన ప్రముఖ కవులు పద్యానువాదాలు చేశారు. వీటిలో 'తివిరి యిసుమున దైలంబు దీయవచ్చు' అంటూ సూటిగా తేటగా చేసిన ఏనుగు లక్ష్మణకవి పద్యానువాదమే ప్రజల మన్ననలందుకుంది. సంస్కృతంలో భర్తృహరి శతకత్రయానికి మహాబలుడు, ఆవంచ రామచంద్ర బుధేంద్రుడు చక్కని వ్యాఖ్యానాలు రాసినారు.

భర్తృహరి - 'నీతి శతకమ్': భర్తృహరి 'నీతి శతకమ్'ను 'దిక్కాలాద్యన వచ్ఛిన్నానన్త చిన్మాత్ర మూర్తయే' అంటూ మంగళాచరణ శ్లోకంతో ప్రారంభించి - అనుభవంతో మాత్రమే తెలిసే తేజఃస్వరూపం పరబ్రహ్మమూర్తికి నమస్కరించాడు. ఇందులో మూర్ఖ పద్ధతి, విద్వత్పద్ధతి, మానశౌర్య పద్ధతి, అర్థ పద్ధతి, దుర్జన పద్ధతి, సుజన పద్ధతి, పరోపకార పద్ధతి, ధైర్య పద్ధతి, దైవ పద్ధతి, కర్మ పద్ధతి అనే పది శీర్షికల క్రింద శీర్షికకు పది చొప్పున మొత్తం నూరు శ్లోకాలున్నాయి. శీర్షికను బట్టి వారి వారి, వాటి వాటి స్వభావాలను వర్ణించిన శ్లోకాలు ఇవి. తెలియనివారికి సులభంగా బోధింపవచ్చు, తెలిసినవారికి సుఖతరం తెలియజెప్పవచ్చు, కానీ తెలిసీ తెలియని మూర్ఖులకు చెప్పి రంజింపజేయడం బ్రహ్మతరం కాదని 'అజ్ఞ సుఖమారాధ్య' (శ్లో.2) శ్లోకంలో చెబుతాడు.

**'భుజకీర్తులూ, చంద్రహారాలూ, చందనాది పూతలూ ఇవేవీ నిజమైన అలంకారాలు కావనీ, సంస్కరింపబడిన మాట ఒక్కటే మనిషికి నశింపని భూషణం' అని 'కేయూరాణి న భూషయన్తి' శ్లోకంలో వివరిస్తాడు. 'జాతి పాతాళానికి పోయినా, వంశానికి అగ్గి అంటినా, మాకు ద్రవ్యమొక్కటే చాలు ననే ధనవంతుల స్వభావాన్ని 'జాతిర్యాతు రసాతలం..' (31) శ్లోకంలో విశదీకరిస్తాడు. 'సుకవితా యద్యస్తి రాజ్యేన కిం? (17) మంచి కవిత ఉంటే రాజ్యమెందుకు? అనీ ప్రశ్నిస్తాడు. 'వారాంగానేవ నృపనీతిరనేకరీతిః' (38) అంటూ రాజనీతి అనేక రీతుల్లో ఉంటుందనీ చురకవేస్తాడు.**

జీవితంలో పౌరుషమ్ వృథా అనీ దైవమే శరణమనీ 'నేతాయస్య బృహస్పతి' (81) శ్లోకంలో చెబుతాడు. విధి (దైవం) బలవత్తరమైనదనీ అంటాడు. దైవం కూడా కర్మను బట్టి ఫలాన్ని ఇస్తుంది కనుక విష్ణువు పది అవతారాలెత్తడానికి, శివుడు కపాలహస్తుడై భిక్షుకుడవడానికీ, బ్రహ్మ బ్రహ్మాండంలో తన పని నిర్వర్తించడానికీ, సూర్యుడు ఆకాశంలో ఎప్పుడూ తిరగడానికీ కారణమైన సర్వ నియమనశక్తిగల కర్మకు నమస్కారమంటాడు.

పూర్వ పుణ్యం మిక్కిలిగా ఉన్న మనిషికి భయంకరారణ్యమైనా సౌకర్య నగరం అవుతుందనీ, శత్రువులూ ఆత్మీయులవుతారనీ, ధరణి వారికి రత్నాల నిధి అవుతుందనీ- 'భీమం వనం భవతి తస్య పురం ప్రధానం' (100 శ్లో.) అనే శ్లోకంతో భర్తృహరి తన 'నీతి శతకమ్'ను ముగిస్తాడు.

'జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః!
నాస్తి తేషాం యశః కాయే జరామరణజం భయమ్!'

**(మంచి కృతులను రచించినవారూ, నవరసాలను సిద్ధింపజేసేవారూ అయిన సుకవీశ్వరులు మహనీయులుగా వర్ధిల్లుతారు. వారి కీర్తి దేహాలకు జరా మరణాలతో పుట్టే భయాలేవీ ఉండవు!)**



కిరణ్ వరికిల్ల

## నాయిన మనసు

మా నాయిన కండ్లల్ల
ఆడిబిడ్డ లేదనే మనాది
ఎవుసం భూమి కొన్నప్పుడే తీరిపోయింది.
ఎందుకంటే, పసికందుకు కాళ్ల మీద తానమాడిచ్చినట్టు
పిల్ల కాలువను పారిచ్చి పొలానికి తానమాడిస్తుండే,
ఎవల దిష్టి పడ్తదో అని దిష్టి చుక్కలు పెట్టినట్టు
సుట్టు ముట్టు దిష్టి బొమ్మలు వెడ్తుండే,
ముండ్ల కంపలకు మంట వెట్టి పొగ వారిస్తే
కుద్దు ధూపమేసినట్టుగా అనుకుంటుండే.
ఆకలితో లోపలికి పోయిన పొత్తి కడుపుకి పాలు తాపినట్టు
పొక్కిలి వడ్డ మడులకు నీళ్లు తాపుతుండే
ఉయ్యాలలేసి రాగమందుకొని నిద్రవుచ్చినట్టు
నాట్లేసి రాగమందుకుంటే
సేనంతా కదలక మెదలక ఒక్కతీరుగ ఒదిగిపోతుండే
కాళ్లు సేతులు వొంకర పోవద్దని రెండు పోలియో సుక్కలేసినట్టు
అప్పుడప్పుడు పావుసేరు మందుజల్లుతుండే,
అదేందో నిన్న మొన్నటిదాక సిన్న పిల్ల తీరంగ ఉన్న మొలకలన్నీ
ఇప్పుడు పరువమచ్చి పచ్చ పైట సుట్టుకున్న పైరు లెక్క అయ్యింది.
ఎంతైనా నాయిన మనసు కదా
ఎవల పాపిష్టి కన్ను పడకుండా
సుట్టు ముట్టు కంచె కట్టి కాస్క సూస్తడు.
పోశమ్మ పండుగ జేసి లగ్గానికి ముస్తాబు చేసినట్టు
సుట్టాలందరిని పిలిశి మైసమ్మకి కోడి కోస్తుండే,
వొడ్ల కుప్ప వోసి బీట్ల వొదిలినప్పుడు
పైడి ముట్టజెప్పినట్టు అనుకుంటుండే
అరిసేతుల మొలిసిన కాయల లెక్క
నాలుగు రాళ్లు చేతులల్ల కాయంగనే
దీపం మీద ఉసిళ్లు పడ్డట్టు అప్పుల్లోళ్లు మీద పడుతుండే.
అయినా పైసలు పోతే పోయినయ్ కని
మోసపోయి పుట్టింటికొచ్చిన ఆడబిడ్డ లెక్క
దళారోళ్ల సేతిలో దగా పడి ధాన్యం
వెనక్కి పంపకపోతే సాలు అనుకుంటూ
ఒడ్ల పొన్న గెట్టు రాళ్ల లెక్క కొయ్యబారి పోయిన
నాయినని సూస్తుంటే
ఎవలో నా పాణాన్ని గుండెలకెల్లి
ఏతమేసి తోడినట్టు అనిపిస్తుండే.



సందీప్ వొటారికారి
93902 80093



## వెలుగు పాట

ఏడాది అయినా
మనసు ముక్కలు ముక్కలుగానే ఉన్నది
గోడలన్ని నల్లటి మస్కలు నీ పాట మాటినక
వెలుగు పాటను పోగొట్టుకున్నట్టున్నది
వాకిట్లో పూలచెట్టు తలవాల్చే ఉన్నది!

అమాంతం
జీవనది ఒక్కసారిగా ఆగిపోయినట్టుంది
నీ సవ్వడి లేక కాలం దిగులేసుకున్నది

ఆకాశం నుంచి చినుకుల్లా
జన మైదానంలో ఆ రాగాలు
గోరింటాకు పూసినట్టే
గల గల గర్జనకు
నేల మీద జనమే కాదు
చెరువులో చేపలు కోలాటమేసేవి
జ్వరం పట్టినవాడు కూడా
జెజ్జనకరే జెన్ దూలా ఆడేది

సెలయేరులా రాగం ఎంత మధురం
పాటల పేగు మెడకేసుకొని పుట్టినట్టు
కణ కణ కంచు కంఠం గాంభీర్యంగా
నెమలి పింఛం విప్పినట్టు గొప్ప ఊపిరి
రాళ్లకు రెక్కలను మొలిపించే పాటలు
గుండెలను వేడెక్కించే గీతాలు
గడ్డిపోసలు నిటారుగా నిలబడే పౌరుషాలు
ఒక్కొక్క పాట ఒక్కో లడాయే!

ఆధిపత్యాలనే కాదు
కరుణ లేని శివుడునీ కడిగేసిన ధీరత్వం
ఆలోచనలను మండించే సామాజిక స్ఫూర్తి
అనేక సమభావనల మూర్తిమత్వం
వెన్నెల పొడుపులా
తెలంగాణ సాకారానికి
నిప్పుల నెగళ్ల పాటలు!

కరెంట్ లేకున్నా సర్దుకుంటాం
విత్తనం మొలువకపోయినా బిగపట్టుకుంటాం
నీ ధ్వని వినకపోతే ఉండలేకపోతున్నం
పాలమూరు పాట తీపిని చూసి
కళ్లు మండినట్టున్నవి
ఎదుగుతున్నప్పుడే తుంచటం ఎంత విషాదం

మిత్రమా..
సముద్రమంతా దుఃఖమైనా విప్లవిస్తాం
మీ ఆశయ సిద్ధికి కవిత్వమై ప్రవహిస్తాం..



వనపట్ల సుబ్బయ్య
94927 65358

## నేను కాపలా కుక్కనే!

**నాకు చిన్నప్పటి నుంచి కొన్ని అలవాట్లున్నాయి. కోడి పిల్లలను తినడం, పిల్లుల వెంట పడటం, కుండలను దొబ్బడం, పొయ్యి తొవ్వడం లాంటివి. విశ్వాసం కలదాన్నే కానీ, పుట్టుకతో వచ్చిన అలవాట్లు ఎలా పోతాయి!**

చిన్నప్పటి నుంచి ఎలా పెంచితే అలా ఉంటాను. గాలికి తిరిగితే అవే అలవాట్లు వస్తాయి. రాత్రి పూట చలికి బొంత తెచ్చుకోవాలనుకుంటా.. ఉదయాన్నే చెవులూపుకొంటూ వెళ్లిపోతా.

అవసరం బట్టి నడుచుకుంటాను. యజమాని మంచిగా చూసుకుంటే ఈగ కూడా వాలనివ్వను. చిన్నచూపు చూస్తే, దొంగలు సర్వస్వం ఎత్తుకుపోయినా పల్లెత్తు మాట అనను. అలాంటి నైజం నాది. నన్ను రకరకాల పేర్లతో పిలుస్తారు. పప్పీ అని, చింటూ అని, డాగ్ అని!



నాకు జరిగిన అవమానం గురించి చెప్తా వినండి. నేను పెద్ద మ్యాతరి సవారీ కాశన్న ఇంట్లో పెరుగుతున్న. ఆయన నన్ను అల్లారు ముద్దుగా పెంచుతున్నాడు. కన్నబిడ్డల కంటే ఎక్కువగా చూసుకుంటున్నాడు. ఆయన కాపోళ్లకు మాదిగతనం చేస్తున్నాడు (మాదిగతనం అంటే ఎట్టి). మాదిగ బాయి కాడ మోట కొడుతున్నడు. నేను బావి గడ్డన పడుకున్నాను. సవారీ కాశన్న చాలా దృఢంగా ఉండేది. ఆకలి ఎక్కువ కానీ, తినడానికి తిండి లేదు. ఆకుకూరలు, ఎద్దు కూరతో కడుపు నింపుకొనేది. నేను కూడా బలంగా, అందంగా ఉండేది. ఎవరైనా సరే నా కంటికి చీమలా కనిపించేది. ఎవరినీ ఏమనక పోయేది!

నా జోలికి ఎవరైనా వస్తే వదలక పోయేది. నా యజమాని అనుమతి లేకుండా ఎవరొచ్చినా నిలబెట్టేది. ఆ విధంగా కొనసాగుతున్నది నా జీవితం.

ఒకరోజు మా యజమాని మాదిగ సవారీ కాశన్న మోట కొడుతుండు. నేను తుమ్మచెట్టు నీడన నిద్రపోతున్న. గొర్రెల మందలను తోలుకొని గొర్రెల కాపరులు పడమర నుంచి తూర్పునకు వస్తున్నారు. భుజాన గొంగళి, వీపున చద్ది మూట, చేతిలో గొడ్డలి చిప్ప, రెట్టకు వెండి కడెం, చెవులకు బంగారు పోగులు, నెత్తిన ఎర్రటి రుమాలు, అంచు గోసివాళ్లు నలుగురు, నా జాతి కుక్కలు నాలుగు, సద్ది సామాన్లు మోయడానికి రెండు గాడిదలు వారి వెంట వస్తున్నాయి.


పండుకున్న నన్ను చూసి.. 'ఈ కుక్క చూడరా ఎట్లా బలిసిందో. గొడ్డు కూర తిని బలిసింది. ఎంతైనా మాదిగోళ్ల కుక్కలు ఈ విధంగానే ఉంటాయి. మన కుక్కలు చూడు ఎముకలు కనిపిస్తున్నాయి' అని వాళ్లు అనుకుంటూ వెళ్లిపోతున్నారు. నాకు చాలా కోపం వచ్చింది! వాళ్లు అంటున్నా ఏమీ పట్టించుకోకుండా ఆయన పని ఆయన చేసుకుంటున్నాడు. నన్ను అంటే అననీ కానీ, తిండి పెట్టిన యజమాని కులాన్ని అవమానపరిచారు. నాకు నచ్చ లేదు!

వాళ్లు కనుచూపు మేరలో పోతున్నారు. నేను లేచి లగ్ కొట్టాను. ఎక్కడినుంచి వచ్చారో అక్కడి వైపు తరిమాను. గొర్రెలు, కాపరులు, కుక్కలు, గాడిదలు చెల్లాచెదురైనాయి. వాళ్లు మాత్రం కంటికి కనిపించకుండా దాక్కున్నారు! నేను పరుగులు పెడుతుంటే నా యజమాని నన్ను దేవులాడుకుం టూ వచ్చాడు. అప్పటికే అన్ని పరారయ్యాయి. ఒక గొర్రె పొట్టేలు మాత్రం తు మ్మ పొదల సందున కొమ్ములు ఇరుక్కొని చనిపోయి ఉంది. దాన్ని ఎత్తుకొని పోయి, కోసి, కుప్పలు వేసి అందరికి పంచాం. నాతో పాటు అందరం పుష్టిగా తిన్నాం!

రెండు రోజుల తర్వాత ఆ గొర్రెల కాపరులు మా యజమాని దగ్గరకు వచ్చి తప్పిపోయిన పొట్టేలు గురించి వాకబు చేశారు. జరిగిన విషయం మొత్తం వివరించాడు. తప్పుడు కూతలు కూసినందుకు క్షమాపణ చెప్పి వెళ్లిపోయారు. ఎవరైనా కులం పేరుతో అవమానిస్తే ఇలాంటి గతే పడుతుంది! కానీ, నాకున్న రోషం మనుషులకు లేనందుకు బాధగా ఉంది! నాటి నుంచి నేటివరకు కాపలా కుక్కనే!! నాకు ఉన్న విశ్వాసం పాలకులకు లేకపాయే!!



ఎదిరెపల్లి కాశన్న



## కళ్లము కనపడదాయే!


కళ్లము యాదికొచ్చిందంటే
నోట్లె తేనె పడ్డంత సంబురం
బంతి కాడి బాగోతం పాటలకు
ఎడ్లకు సుత ముద్దొచ్చి
చెవులు రిక్కించుకొని వినేవి
కుప్పల మీది బూడిద ముగ్గుతో
కళ్లము పున్నమి ఎన్నెలోలె కనపడేది
కావలి కాసే రాత్రులల్ల
సంకురాతిరి గొంగళ్లను
అలుముకొని మురిసిన గడ్డివాములెన్నో!

జోలెల నోళ్లు నింపి
బిచ్చగాళ్ల ఆకలి తీర్చే
అదో కర్ణుడి చేయి
గుల్లకు, గుమ్మికి, కచ్చురముకు
ముచ్చట కలిపి
అప్పుడప్పుడు రేలు, పగళ్ళ లెక్క చూసే
పంట పొలాల ఒంటరి సిపాయి
తూర్వాల పుణ్యమో,
మట్టి పెట్టే బిచ్చమో కానీ!
తర్ర వడ్లతో, తాలు బియ్యంతో
లేకి బతుకులను నిలబెట్టే నిట్టాడు
ఎర్రటెండ పోటుకు
చెమట కార్చే చేతను చూసి
కలుక్కుమనే కన్నీటి మొగులు
ఇసుక, నువ్వుల కలెగలుపు కుప్పలను
కోడుచూ, చెరుగుచూ వేరుచేసే తీరు చూసి
పొంగి పొర్లే అలుగు
కమ్మరి, కుమ్మరి, వడ్లోళ్ల బంతికి
తానే గలగలమనే దొంతుల సద్దు
కంది పొరకను పొనుకలల్ల నింపి
పొయ్యికి పంపే ఇంటి బందుగు
కొట్టాల్లోని పనుల మందకు
పూట కూలమ్మ

కాలం మారిపోయే
కళ్లము కనపడదాయే
ఎటుచూసిన మోటార్లాయే
ఎదుగుడో, తగ్గుడో కానీ!
ఎద్దులు సుత కనుమరుగవుతుండే!



వూట్ల భద్రయ్య
95502 56840



**సాహిత్యాభిమానులు శ్రీశ్రీగా పిలుచుకొనే శ్రీరంగం శ్రీనివాసరావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి.. వీరిద్దరూ ఆధునిక కవుల్లో ప్రసిద్ధి చెందినవారు. వీరివి విభిన్న దృక్పథాలు. ఒకరిది భావ కవిత్వం కాగా, మరొకరిది అభ్యుదయ కవిత్వం.**

## కవితాకాశంలో ఇద్దరూ ఇద్దరే

వ్యావహారిక భాషలో, లలితమైన పదాలతో, ప్రకృతితో మమేకమై పండిత పామరులను ఆహ్లాదపరిచేది 'భావ కవిత్వం'. 'రాబర్ట్ ఫ్రాస్ట్', 'విలియం వర్డ్స్ వర్త్' వంటి కవుల కలాల నుంచి ఉద్భవించిన రొమాంటిక్ పోయెట్రీ, తెలుగు సాహిత్యంలో భావ కవిత్వమైంది.

తెలుగులో భావకవి అనగానే గుర్తుకొచ్చే కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి. కవిత్వ భాషలో సౌందర్యాన్ని, సున్నిత భావోద్వేగాలను, ప్రకృతికీ, చెట్లకు, పూలకు, ఆకులకు, నీలి మేఘాలకు అన్వయిస్తూ, పాఠకుల మనసుల్లో మల్లెల మాలలూగించారు కృష్ణశాస్త్రి గారు. భావాంబర వీధిలో ఓలలాడించారు. ప్రకృతి అందాలకు పరవశించి 'ఆకులో ఆకునై, పూవులో పూవునై' అంటూ రాశారు. అలాగే 'ఘనా ఘన సుందరా' అంటూ భక్తి భావగీతాలు కూడా రాశారు.

ఆకు కదలికలకు పరవశం, గాలి సవ్వడికి తన్మయత్వం, మల్లె సౌరభానికి ఉప్పొంగిపోయే కవిత్వం మనకు అందించిన 'ఆంధ్రా షెల్లీ' కృష్ణశాస్త్రి గారు. ఆయన కవిత్వం ఎప్పుడు విన్నా, ఏదో తీయని లోకాల్లో విహరిస్తున్నట్టుగా ఉంటుంది. 'మనకు కీట్స్, షెల్లీ, వర్డ్స్‌వర్త్ వంటి కవులు లేరు. ఆ కవులు మన దేశంలో కృష్ణశాస్త్రిగా పుట్టినారని నా అభిప్రాయం' అని అన్నారు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు.

**ఇక 'కవిత్వం అంటే ఓ తీరని దాహం' అన్నారు శ్రీశ్రీ. సాధించిన దానితో ఒకింత సంతోషం కలిగి, దానితో సంతృప్తి చెంది, అదే విజయం అనుకుంటే పొరపాటోయి' అన్న శ్రీశ్రీ భావం అక్షర సత్యం. ప్రతి ఒక్క కవికీ ఒక మంత్రోపదేశం.**

శ్రీశ్రీ తన 18వ ఏట 'ప్రభవ' అనే కావ్య సంపుటిని సాంప్రదాయ పద్ధతిలో రాశారు. తర్వాతి కాలంలో గ్రాంథిక శైలి, ఛందస్సు, పక్కనపెట్టి వాడుక భాషలో గురజాడ అడుగుజాడల్లో రాయడం మొదలుపెట్టారు.

ప్రజాస్వామ్య భావాలను కవిత్వంలో ప్రవేశపెట్టారు శ్రీశ్రీ. మనిషి కేంద్ర బిందువుగా కవితాగానం చేశారు. విశ్వజనీన ప్రతీకలను బలంగా చెప్పడం వల్ల, శ్రీశ్రీ మహా కవిత్వమైన మహాప్రస్థానం ప్రజల హృదయాల్లో శ్రీశ్రీ అనగానే గుర్తొచ్చేంతగా ముద్ర వేసుకుపోయింది. కవిత్వంలో ఒక కొత్త శైలినీ, అభ్యుదయ వాదాన్ని ప్రవేశపెట్టి, నేటి తరాన్ని ప్రభావితం చేశారు. 'కుక్క పిల్లా, అగ్గిపుల్లా, సబ్బు బిళ్ల' కాదేదీ కవితకనర్హం' అంటూ కవితా వస్తువును పరివ్యాప్తం చేసిన శ్రీశ్రీ ఎంతో మందిని కవిత్వం వైపు అడుగులు వేయించారు. ఒక ప్రత్యేకమైన ఒరవడి సృష్టించారు. శ్రీశ్రీ కవిత్వంలో అభ్యుదయ భావం ఎంత ఉందో సాంప్రదాయ కవిత్వ ప్రభావం కూడా అంతే ఉంది.

'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ, ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ' అన్నారు చలం. భావాంబర వీధిలో విహరింపజేసి మనోల్లాసం కలిగించే కృష్ణశాస్త్రి గారి కవిత్వం, అభ్యుదయ పథంలో నడిపిస్తూ చైతన్యస్ఫూర్తి రగిలించే శ్రీశ్రీ కవిత్వం.. ఇద్దరి రచనలూ నేటి తరానికి స్ఫూర్తిదాయకం.



డాక్టర్ కేతవరపు రాజ్యశ్రీ
85001 21990